సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం ; 20 ; ఫిబ్రవరి ; 2023



భక్తజన 'ఝురి'

మహాశివరాత్రి ఉత్సవాల్లో శనివారం రాత్రి జాగరణ ఆచరించిన భక్తులు ఆదివారం ఝురి స్నానాలు ఆచరించిశ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు. - 8లో



నేత్రపర్వం.. కామాక్షి త్రేతేశ్వరుని కల్యాణం

అత్తిరాలలో మాహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. - 8లో



ఏడేళ్లకే నూరేళ్లు నిండాయి

నీటి సంపు గుంతలోని నీళ్లలో పడి రఖీముద్దీన్ అనే ఏడేళ్ల బాలుడు ఆదివారం మృత్యువాత పడ్డాడు. - 8లో

న్యూస్‌రీల్

నేడు స్పందన కార్యక్రమం

రాయచోటి: భారత ఎన్నికల సంఘం అనుమతి మేరకు సోమవారం స్పందన కార్యక్రమాన్ని యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఏకసభ్య కమిషన్ జిల్లాకు రాక

రాయచోటి: బెంటో-ఒరియా, బోయ వాల్మీకి సమస్యలపై అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్‌గా నియమితులైన ఐ శామ్యూల్ ఆనంద్ కుమార్ (ఐఏఎస్) బోయ (వాల్మీకి), ఇతర వర్గాల ప్రజలతో బహిరంగ సభ నిర్వహించేందుకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఈనెల 21వ తేదీ రాన్నునారని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు.

నిత్యపూజ స్వామి హుండీ ఆదాయం రూ.11,95,210



స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సిద్దవటం: మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలోని లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్య పూజస్వామి హుండీ ఆదాయం రూ. 11, 95, 210 వచ్చిందని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. నవంబర్ 25వ తేదీ 2022 నుంచి ఫిబ్రవరి 19వతేదీ 2023 వరకు భక్తులు స్వామి వారి హుండీలో వేసిన కానుకలను దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులు, పోలీసుల సమక్షంలో శనివారం అర్ధరాత్రి లెక్కించామన్నారు. హుండీ ఆదాయం రూ. 11,95, 210 వచ్చిందన్నారు. కల్యాణం చదివింపుల ద్వారా వచ్చిన నగదు రూ. 5,556 కాగా, లడ్డు వేలం పాట ద్వారా వచ్చిన నగదు రూ. 10 వేలు, హుండీ ద్వారా బంగారం , వెండి కూడా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి. కొండారెడ్డి, శివారెడ్డి, ఆలయ అర్చకులు, సుబ్రమణ్యం శర్మ, పోలీసులు, ఆలయ సిబ్బంది చంద్ర, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు జేఎన్‌టీయూ జట్టు

మదనపల్లె సిటీ: ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలకు జేఎన్‌టీయూ జట్టును ఎంపిక చేశారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఎంపికై న క్రీడాకారులకు శిక్షణ ఇచ్చారు. వీరు బెంగళూరు రేవా యూనివర్సిటీలో జరిగే ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో పాల్గొంటారు. ఎంపికైవారి వివరాలు ... దినేష్‌కుమార్(తిరుపతి), అరుణ్‌కుమార్(కర్నూలు), గౌతమ్(తిరుపతి), ఇమ్మానుయేల్ (అనంతపురం), ప్రశాంత్‌రెడ్డి, (అనంతపురం), వెంకటప్రసాద్(మదనపల్లె), సాయిపవన్(మదనపల్లె), తేజ్‌కుమార్(అనంతపురం), మురళి (నెల్లూరు), పవన్ వెంకటసాయికుమార్(కావలి), షేక్ జావిద్(తిరుపతి), షణ్ముఖ వెంకట్ (అనంతపురం), అజిత్‌బాబు (నెల్లూరు), శాంతిస్వరూప్(గూడూరు), మల్లేశం (మదనపల్లె),ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌దరరెడ్డి, (పులివెందుల) ఎంపికైనట్లు ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్, పీడీ ఫరూక్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

పొలతలలో ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి: పొలతల శైవ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మల్లేశ్వరస్వామి, పార్వతిదేవి, అక్కదేవతలు, పులిబండెన్న స్వాముల వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి స్వామివారి రథోత్సవం మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి అక్కదేవతల గుడి వరకు వైభవంగా నిర్వహించనున్నారు.

కష్టాలను ఓడించిన సుధీరుడు!

- నాటి పేపర్ బాయ్.. నేడు అమెరికాలో సైంటిస్టు
- ఢిల్లీ ఎయిమ్స్‌లో హెచ్ఐవీపై పరిశోధనకు పీహెచ్‌డీ
- పిట్స్‌బర్గ్ వర్సిటీ, ఎస్పీఆర్ఐలో పరిశోధనలు
- మూడు పేటెంట్ హక్కులు కైవసం
- ప్రముఖ పరిశోధన సంస్థలు, సైంటిఫిక్ జర్నల్స్‌లో సభ్యత్వం
- స్వశక్తితో ఎదిగి నేటి యువతకు స్ఫూర్తి



SAKSHI SPECIAL

పరిశోధనల్లో డాక్టర్ రావూరి సుధీర్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: కన్నవారు దూరమైన దుర్భర బాల్యం. ఇతరుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి బతకాల్సిన దైన్యం. అవమానాలు, ఆటంకాలు, మరెన్నో ప్రతిబంధకాలు. కష్టాలన్నీ కట్టకట్టుకు వచ్చినా ఆయన పట్టుదల, పరిశ్రమ ముందు అవి తలవంచక తప్పలేదు. బాల్యంలోనే ఎన్నో సవాళ్లను చెరగని చిరునవ్వుతో ఎదుర్కొన్నారు. ఒకప్పుడు వీధుల్లో పేపర్ బాయ్‌గా తిరిగిన ఓ యువకుడు అంచెలంచెలుగా ఎదిగి నేడు అమెరికాలో మంచి సైంటిస్టుగా రాణిస్తున్నారు. ప్రస్తుతం ''సెంటర్ ఫర్ రీ జనరేటివ్ స్పోర్ట్స్ మెడిసిన్'' డిప్యూటీ డైరెక్టర్‌గా మల్టీ డిసిప్లినరి రీసెర్చ్ ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. ఎన్నో అద్భుత విజయాలు తన ఖాతాలో వేసుకుని నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న కడప నాగరాజుపేటకు చెందిన ఆయన పేరు డాక్టర్ రావూరి సుధీర్‌కుమార్.

బాల్యం గడిచిందిలా!

పసితనంలోనే తల్లిదండ్రులు దూరం కావడంతో అవ్వ చల్లా కమలమ్మ అక్కున చేర్చుకుంది. ఐదవ తరగతి వరకు నాగరాజుపేట గుండాచారి బడిలో చదువుకున్నారు. విశ్రాంత ఉపాధ్యాయురాలైన అవ్వ కమలమ్మకు చదువు విలువ ఏమిటో బాగా తెలుసు. చదువే నిజమైన ఆస్తి అంటూ మనవడికి తరచూ నూరిపోసేది. అవ్వ మాటలు ఆయనను ఎంతో ప్రభావితం చేశాయి. గుంతకల్లు, గుత్తిలో పిన్ని ఇంట హైస్కూలు విద్యాభ్యాసం సాగింది.

సైన్స్ పట్ల జిజ్ఞాస

గుత్తి రైల్వే ఇంగ్లీషు మీడియం హైస్కూలులో తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఆకుల నుంచి విద్యుత్ తయారవుతుందని 'ఎలక్ట్రానిక్స్ ఫర్ యూ' అనే పత్రికలో చదివాడు. అందుకు జిల్లేడు, బొంత జెముడు ఆకులు పనికి వస్తాయని సుధీర్ కనుగొన్నారు. ఇలా ఆయన బయో లాజికల్ బ్యాటరీ తయారు చేశాడు. అప్పట్లో హైదరాబాదులో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రపతి వెంకట్రామన్ నుంచి సర్టిఫికెట్ అందుకున్నారు. సిమ్లాలో జరిగిన ఇంటర్ స్టేట్ సైన్స్ ఫెయిర్‌కు ఈ ప్రయోగం ఎంపికై ంది. ఇంటర్మీడియేట్ కడప సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో, 1994-97లో ఆర్ట్స్ కళాశాలలో బీఎస్సీ పూర్తి చేశాడు. తాను ఇంకొకరికి భారం కారాదని భావించి పేపర్ బాయ్‌గా, వీడియో కెమెరామెన్‌గా కొన్నాళ్లు పనిచేశారు. గ్రూప్-4, బ్యాంకు పరీక్షలు రాశారు. బీఈడీలో ఉచిత సీటు వచ్చింది. సైంటిస్టు కావాలన్న బలమైన ఆకాంక్ష వల్ల వాటిని వదులుకున్నారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ వైరాలజీ ప్రవేశానికి కిశోర్ అనే స్నేహితుడు రూ. 400 సాయం చేసి దరఖాస్తు చేయించగా సీటు వచ్చింది. తిరుపతిలో ఉన్న మరో పిన్ని ఇంటిలో ఉంటూ చదువు కొనసాగించారు. తన ఖర్చులు తాను సంపాదించుకోవాలని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో పార్ట్ టైం అధ్యాపకునిగా పనిచేశారు. ఖర్చులు తగ్గించుకోవడంలో భాగంగా తన జుట్టు తానే కట్ చేసుకోవడం నేర్చుకున్న ఆయన ఒక సెలూన్ కూడా ప్రారంభించాలని భావించారు.



అమెరికాకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జానీ హువర్డ్‌తో సుధీర్‌కుమార్

వెటర్నరీ వైరాలజీ పైన ఎమ్మెస్సీ ప్రాజెక్టు వర్క్‌ను తిరుపతిలో చేశారు. 1999లో ఎమ్మెస్సీ పూర్తయ్యాక అక్కడి కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్‌లో ఐసీఏఆర్-ఐఏఆర్‌టీ ఫెలోషిప్ జాబ్ చేశారు. జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకులో ఉన్న బెంగళూరులోని ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్‌సీ)లో మోనోక్లోనల్ యాంటీ బాడీస్‌పై పనిచేశారు. వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్‌లో డయాగ్నస్టిక్స్ చేశారు. ఈ సమయంలో రెడ్డీస్ ల్యాబ్‌లో ఉద్యోగం వచ్చింది. అయితే అదే సమయంలో ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో హెచ్ఐవీ-1పై పనిచేసే అవకాశం తలుపు తట్టగా, దాన్నే ఎంచుకున్నారు. దీంతో ఆయన జీవితం పెద్ద మలుపు తిరిగింది. హెచ్ఐవీ సోకిన వ్యక్తిలో రోగ నిరోధకశక్తి తగ్గిపోయి త్వరగా మరణానికి చేరువవుతాడు. అలాంటి వ్యక్తుల్లో వచ్చిన జన్యుపరమైన మార్పులను గుర్తించి దానికి తగ్గట్టు కాంబినేషన్ మందుల్లో ఎలాంటి మార్పులు చేయాలన్న అంశంపై పరిశోధన చేశారు. ఆయనకు 2006లో పీహెచ్‌డీ తోపాటు పేటెంట్ హక్కులు లభించాయి.

అమెరికాలో పరిశోధనలు

సుధీర్ అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలోగల పిట్స్‌బర్గ్ యూనివర్సిటీకి పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్‌పై వెళ్లారు. మెంటార్‌గా కూడా పనిచేశారు. రీసెర్చి అసోసియేట్‌గా తొమ్మిదేళ్లు పిట్స్‌బర్గ్‌లో ఉన్నారు. నిర్వీర్యం చేసిన హెచ్ఐవీ వైరస్‌లోకి ఉపయోగకరమైన జన్యువులను పంపి తద్వారా వచ్చిన నిర్వీర్య వైరస్‌ను మూల కణాల ఉత్పత్తి, రొమ్ము క్యాన్సర్ నిరోధానికి ఉపయోగించడంపై పరిశోధన చేశారు. కొలరాడోలోని స్టెడ్‌మన్ ఫిలిప్పన్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (ఎస్పీఆర్ఐ)లో 'వార్థక్య దశకు చెందిన కణాలను గుర్తించి నిర్మూలించడం ద్వారా మెరుగైన వృద్ధాప్య జీవితం' అనే అంశంపై పరిశోధన చేశారు. అక్కడి ప్రసిద్ధ శాస్త్రవేత్తలతో కలిసి జీన్ థెరపి, స్టెమ్‌సెల్ బయాలజీ, టిష్యూ ఇంజినీరింగ్ అంశాల్లో పనిచేశారు. అమెరికా ప్రభుత్వానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, డిపార్టుమెంటు ఆఫ్ డిఫెన్స్, యూఎస్ ఒలంపిక్ అండ్ పారాలింపిక్ నేషనల్ మెడికల్ సెంటర్‌లో పరిశోధనలు చేశారు.

గ్రాంట్ అవార్డ్స్

ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా ప్లాస్టిక్ సర్జరీ ఫౌండేషన్ గ్రాంటు, కో ఇన్వెస్టిగేటర్‌గా ఎన్ఐహెచ్, డీఓడీ ప్రభుత్వ గ్రాంటు, కో ప్రిన్సిపల్ సైంటిస్టుగా ప్రైవేటు ఇండస్ట్రీ ఫండింగ్ లభించాయి. ఎడిటోరియల్ బోర్డు మెంబర్, గెస్ట్ ఎడిటర్, సైంటిఫిక్ రివ్యూవర్‌గా పలు అంతర్జాతీయ రీసెర్చి జనరల్స్‌లో పనిచేశారు. పలు సైంటిఫిక్ సమ్మిట్స్‌కు చైర్ పర్సన్, కో చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. కొలరాడో స్టేట్ యూనివర్సిటీలో అఫిలియేట్ సైంటిస్టుగా నియమితులయ్యారు. కండరాల్లో మూల కణాలు కనుగొన్న ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ జానీ హువర్డ్‌తో కలిసి ప్రస్తుతం సెంటర్ ఫర్ రీ జనరేటివ్ స్పోర్ట్స్ మెడిసిన్ (సీఆర్ఎస్ఎం)లో మల్టీ డిసిప్లినరీ రీసెర్చి ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు.

ఆకాంక్షతోపాటు నిరంతర కృషి అవసరం



ఏ రంగంలోనైనా ఉన్నత స్థాయికి వెళ్లాలన్న ఆకాంక్ష ఒక్కటే ఉంటే సరిపోదు. అందుకు తగ్గట్టు నిరంతర కృషి ఉన్నప్పుడే లక్ష్యాన్ని అందుకోగలమని విద్యార్థులు గుర్తించాలి. నిరుత్సాహ పడకుండా అవకాశాలు వచ్చేంత వరకు ఓపిక అవసరం. ఒకప్పుడు ఏమీ లేని నేను ఇప్పుడు ఒక స్థాయిలో ఉన్నానంటే అది మా అవ్వ కమలమ్మ, మా ఇద్దరు పిన తల్లులతోపాటు స్నేహితులు కిశోర్, ప్రసాద్, రాజు, మేనమామ చల్లా రాజేంద్ర వరప్రసాద్ (సీఆర్‌వీ ప్రసాద్), టీచర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు ఇచ్చిన సహకారమే కారణం. - డాక్టర్ రావూరి సుధీర్‌కుమార్, నాగరాజుపేట, కడప

నాయీ బ్రాహ్మణ కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్ బాబు, మాజీ మంత్రి రామసుబ్బారెడ్డి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్ బాబు

కడప కార్పొరేషన్: ఈనెల 28వ తేది విజయవాడలోని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించనున్న నాయీ బ్రాహ్మణ కృతజ్ఞతా సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు, మాజీ మంత్రి పి. రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో కృతజ్ఞతాసభ కరపత్రాలను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన కులాలు సమాజానికి వెన్నెముక వంటివారని నిరూపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. సేవకులుగా ఉన్న నాయీ బ్రాహ్మణులను పాలకులుగా చేస్తూ దేవాలయాల పాలకమండళ్లలో స్థానం కల్పించారన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్దవటం యానాదయ్య మాట్లాడుతూ వైఎస్ జగన్ సీఎం అయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా వందలాదిమంది బీసీలకు నామినేటెడ్ పదవులు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. గుర్రప్ప, యువజన అధ్యక్షుడు కె. బాబు, నాయకులు కె. కిషోర్, రామకృష్ణ, పి. ప్రసాద్, ఎస్. వెంకటేష్, విజయ్ కుమార్, కేవీ రమణ, నరసింహులు, వెంకటేష్ పాల్గొన్నారు.

మత సామరస్యం, సౌభ్రాతృత్వానికి ఇస్లాం పెద్ద పీట

- దాన.ధర్మాల ద్వారా పేదలను ఆదుకోండి
- ఇజ్తిమాలో ఉలేమాల పిలుపు



మదనపల్లెలో జరిగిన ఇజ్తిమాకు భారీ సంఖ్యలో హాజరైన ముస్లింలు

మదనపల్లె సిటీ: మత సామరస్యం, సౌభ్రాతృత్వానికి ఇస్లాం పెద్ద పీట వేస్తోందని ముస్లిం ఉలేమాలు, ధార్మిక మత గురువులు మౌలానా అజ్మల్‌సాహెబ్, మౌలానా నూర్ అహ్మద్‌సాహెబ్, మౌలానా ముఫ్తి ముజాహిద్‌సాహెబ్, మౌలానా ముఫ్తి అస్లాంసాహెబ్, మౌలానా మౌల్వి అక్బర్ షరీఫ్ సాహెబ్‌లు పేర్కొన్నారు. మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులోని టిప్పు సుల్తాన్ వక్ఫ్ మైదానంలో జరుగుతున్న దీనే ఇజ్తిమాలో (ఇస్లాం మత ధార్మిక సదస్సు) రెండవ రోజు ఆదివారం ఉలేమాలు, మతగురువులు ధార్మికోపన్యాసం చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవమార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ఒక్కరూ పేదలను ఆదుకోవాలని తద్వారా పేదరికం లేని సమాజం నిర్మించాలన్నారు. స్వార్థాన్ని వీడి సమాజహితం కోసం పాటుపడాలని కోరారు. మనం నివసించే నేలను, శ్వాసించే గాలిని ప్రేమించాలని దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. ఇస్లాం శాంతిని ప్రబోధిస్తుందని ప్రతి ఒక్కరూ శాంతి యుత సమాజ నిర్మాణానికి ముందడుగు వేయాలని సూచించారు. యువత సన్మార్గంలో నడవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

ప్రత్యేక దువాకు లక్ష మందికిపైగా హాజరు

ఇజ్తిమా ముగింపు సందర్భంగా ఆదివారం ప్రత్యేక దువాకు ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలు, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి లక్ష మందికిపైగా ముస్లింలు హాజరయ్యారు. దువాతో ఇజ్తిమాను ముగించడం అనవాయితీగా వస్తోంది. చేతులు పైకెత్తి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమై విశ్వశాంతి కోసం ప్రార్థించారు.

ముగిసిన రెండు రోజుల దీనే ఇజ్తిమా: శనివారం ప్రారంభమైన రెండు రోజుల ఇజ్తిమా ఆదివారం సాయంత్రం ముగిసింది. ముగింపు సందర్భంగా చేపట్టిన దువా ఇజ్తిమాకు ప్రత్యేకంగా నిలిచింది. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా ఇజ్తిమా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఇజ్తిమా సమన్వయకర్త అమీర్ మైలానీ, మసీవుల్లా, మతగురువులు నూర్, హఫీజుల్లా, ఖాసీంఖాన్, జామియా మసీదు మౌల్వీ జలాలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ కేశప్ప, టు టౌన్ సీఐ మురళీకృష్ణ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు.

గంగమ్మ తల్లి.. కోర్కెలు తీర్చే కల్పవల్లి

- నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర
- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- రాయలసీమకే తలమానికం అనంతపురం గంగమ్మ దేవత





ఆలయం చుట్టూ ప్రాకార మండపంతో కూడిన గంగమ్మ దేవత ఆలయం, ప్రత్యేక అలంకరణలో గంగమ్మ దేవత మూలవిరాట్ (ఫైల్ ఫొటో)

లక్కిరెడ్డిపల్లె: రాయలసీమలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన అనంతపురం గంగమ్మ దేవత భక్తుల పాలిట కల్పతరువుగా విరాజిల్లుతోంది. భక్తుల కొంగుబంగారంగా కొలువైన గంగమ్మ దేవత జాతర ఈ నెల 20 నుంచి ప్రారంభం కానుంది. 20న జాగారం, 21, 22 న లక్షలాది మంది భక్తుల నడుమ రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిల సహకారంతో జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్ర రాజు తెలిపారు.

జాతర ప్రారంభం ఇలా..

ఏటా మహాశివరాత్రి ముగిసిన రెండవ రోజు నుంచి జాతర ప్రారంభమవుతుంది. అమ్మవారికి పుట్టినిల్లుగా భావించే కస్తూర్రాజుగారిపల్లె గ్రామంలోని చాగలగుట్టపల్లె నుంచి గంగమ్మ దేవత ఉత్సవ విగ్రహాన్ని తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గట్టి పోలీసు బందోబస్తు నడుమ సంప్రదాయబద్ధంగా మద్దిరేవుల గ్రామంలోని అప్పలరాజుగారిల్లె, మార్లవాండ్లపల్లె, మర్రిచెట్టు, చౌటపల్లె గ్రామాల మీదుగా వేలాది మంది మంది భక్తుల నడుమ దారి పొడవునా అమ్మవారికి జంతు బలులు సమర్పిస్తూ జాతర జరిగే ప్రాంతానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతపురం గంగమ్మ దేవత ఆలయానికి ఉత్సవ విగ్రహం రాగానే అనంతపురం ఈడిగపల్లె గౌడ్‌లు అమ్మవారికి ఎదురు వచ్చి కళ్లు సాంగ్యంతో శాంతింప చేసి ఆలయంలోనికి తీసుకు వస్తారు. అప్పటికే సంతానం లేని వారు తడి బట్టలతో ఆలయంలో సాష్టాంగ నమస్కారంతో ఉండడంతో అమ్మవారికి వరపడిన సంతానం లేని మహిళల మీదుగా గంగమ్మ దేవతను ఆలయంలోకి తీసుకెళ్తారు. గుడి ముంగిటకు అమ్మవారు రాగానే జాతరలో ఒక్క సారిగా అమ్మవారికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి జంతు బలులను ఇస్తారు. ఇదే రోజు శిద్దల పూజ, సిడిమాను పూజలతో పాటు, రాత్రికి చాందిని, కుంకుమబండ్లు తిప్పి భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. మొదటి రోజును నిండు తిరునాలగాను, రెండవ రోజును మైల తిరునాలగాను భావిస్తారు.

జాతరకు భక్తులు వచ్చే మార్గాలు..

గంగమ్మ జాతర జరిగే ప్రాంతానికి భక్తులు రోడ్డు మార్గం ద్వారా మూడు దారులలో రావచ్చు. రాయచోటి- కడప జాతీయ రహదారిలో ఉన్న చిట్లూరుకు పడమర వైపు రోడ్డు నుంచి జాతరకు చేరుకోవచ్చు. లక్కిరెడ్డిపల్లె-రాయచోటి మార్గంలోని మర్రిచెట్టు నుంచి తూర్పు వైపున ఉండే రోడ్డు నుంచి జాతరకు చేరుకోవచ్చు. లక్కిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణం ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి గద్దకుంట రాచపల్లె, ఈడిగపల్లె, చౌటపల్లె మార్గాల ద్వారా గంగ జాతరకు భక్తులు రావచ్చని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సాంస్కృతిక కార్యక్రమాలు:

20న రాత్రి చాగలగుట్టపల్లెలో అమ్మవారి జాగారం రోజున సానవల చిన్నమ్మ కథ, హరికథ, బుర్రకథ కాలక్షేపాలు, 21 న రాత్రి చెక్క భజన, రేలారేరేలా, నృత్య ప్రదర్శన నిర్వహిస్తారు.

తిరునాల కార్యక్రమాలు

20న సోమవారం రాత్రి చాగలగుట్టపల్లెలో అమ్మవారి జాగారం, 21న మంగళవారం నిండు తిరునాల, అమ్మవారికి శిద్దల పూజ, చిడిమాను తిరగడం, సర్వదర్శనం, బోనాలు, చాందినీ బండ్లు ఊరేగింపు జరుగుతుంది. 22న బుధవారం మైల తిరునాల ఊరేగింపుతో, గంగస్నానాలు, అభిషేకాలతో తిరునాల ముగుస్తుంది.

సామాన్య భక్తులకు పెద్ద పీట



జాతరకు వచ్చే సామాన్య భక్తులకు పెద్ద పీట వేసేలా అధికారులను, జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించాం. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆలయ కమిటీకి సూచించాం.

-గడికోట శ్రీకాంత్ రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

దాతల సహకారంతో ఏర్పాట్లు



దాతల సహకారంతో భక్తులకు మెరుగైన వసతులను కల్పించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశాం. భక్తుల దాహార్తిని తీర్చేందుకు నీళ్ల, మజ్జిగతో పాటు అన్నదానం ఉంటుంది.

-సామాల నరసింహారెడ్డి, చైర్మన్, అనంతపురం గంగమ్మ దేవత ఆలయం

భక్తులు అధికారులకు, పోలీసులకు సహకరించాలి



జాతరకు వచ్చే భక్తులు అటు అధికారులకు, ఇటు పోలీసు వారికి సహకరించాలి. వీఐపీ దర్శనంతో పాటు సర్వదర్శనం ద్వారా కూడా భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నాం. విధి నిర్వహణలో భాగంగా జాతరకు వచ్చే అధికారులు, పోలీసులకు కూడా అన్ని వసతులు కల్పిస్తాం.

-రవీంద్రరాజు,గంగమ్మ ఆలయ ప్రత్యేకాధికారి

క్లుప్తంగా

13 మంది జూదరుల అరెస్ట్

మదనపల్లె : పేకాట ఆడుతున్న 13మందిని అరెస్ట్‌చేసినట్లు తాలూకా ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం రాత్రి మండలపరిధిలోని పుంగనూరురోడ్డు, బసినికొండ డ్రైవర్స్‌కాలనీ సమీపంలో పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేసినట్లు చెప్పారు. ఈదాడిలో 13మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.52,470 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య


జనార్దన్ మృతదేహం

పీలేరురూరల్ : ఉరివేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం ముత్తరాసివీధిలో చోటు చేసుకుంది. వివరాలిలాఉన్నాయి. ముత్తరాసివీధికి చెందిన తిమ్మాపురం శ్రీకృష్ణ కుమారుడు జనార్ధన్ (18) ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


యువరాజ్ మృతదేహం

పీలేరురూరల్ : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెంకటప్పశెట్టి కుమారుడు యువరాజ్ (25) స్థానిక తిరుపతి రోడ్డులో కేవీపీ జనరల్‌స్టోర్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి తమ దుకాణం వద్ద నేమ్ బోర్డు ఏర్పాటు చేసే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. విద్యుదాఘాతానికి గురైన యువరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. అతన్ని రక్షించబోయిన తల్లి పద్మావతి, స్నేహితుడు బాబు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాల్లో ఘర్షణ

చాపాడు: వైఎస్సార్ జిల్లా అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం వద్ద శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో సంగీత విభావరి కార్యక్రమం వద్ద ప్రొద్దుటూరు మండలంలోని సీతంపల్లెకు చెందిన యువకులు అసభ్యంగా ప్రవర్తిస్తూ వీరంగం సృష్టించారు. దీంతో గ్రామ సర్పంచ్ కిషోర్ కుమార్‌రెడ్డి, అల్లాడుపల్లె గ్రామస్తులు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తుండగా ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో సీతంపల్లెకు చెందిన ప్రదీప్ అనే యువకుడి తలకు గాయమైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రదీప్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

నేత్రపర్వం.. కామాక్షి త్రేతేశ్వరుని కల్యాణం

ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మేడా దంపతులు



వేదమంత్రాలు పఠిస్తున్న వేదపండితులు,కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వేడా మల్లికార్జునరెడ్డి, కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో మాహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరోరోజు నిర్వహించిన శ్రీకామాక్షి సమేత శ్రీత్రేతేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కల్యాణానికి ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, సుచరిత, మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలి సుబ్బారెడ్డి, ముత్యాల తలంబ్రాలను అందించారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ఈఓ జీ కొండారెడ్డి, చైర్మన్ వీ వెంకటసుబ్బారెడ్డి, ధర్మకర్తలు ఆలయ మర్యాదాలతో ఘన స్వాగతం పలికారు.అర్చకులు స్వామి, అమ్మవార్లను పుష్పాలతో అలంకరించి ప్రత్యేక ఆసనంపై కొలువుదీర్చారు. వేదమంత్రాలతో ఆలయ ప్రధాన అర్చకులు కె. పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య కల్యాణోత్సవం నిర్వహించారు.కల్యాణం నిర్వహించే సమయంలో శివనామ స్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. అనంతరం కల్యాణంలో పాల్గొన్న భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తంబెళ వేణుగోపాల్‌రెడ్డి, వీ గంగిరెడ్డి, హెచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఆర్ కమలేశ్వరరావు, జిల్లా మానటరింగ్ సభ్యుడు ఎస్ రామకృష్ణ, ధర్మకర్తలు ఐ వజ్రశేఖర్‌రెడ్డి, డీఎస్‌పీ జీ శివభాస్కర్‌రెడ్డి, రాజంపేట రూరల్, రైల్వే కోడూరు సీఐలు టీ పుల్లయ్య, విశ్వనాథరెడ్డి, రాజంపేట రూరల్, టౌన్, పెనగలూరు, చిట్వేలి, రైల్వేకోడూరు, కడప సైబర్ సెల్ ఎస్‌ఐలు ఎం భక్తవత్సలం, వెంకటేశ్వర్లు, హేమాద్రి, సుభాష్ చంద్రబోస్, మోహన్‌గౌడ్, చెన్నకేశవ, భక్తులు పాల్గొన్నారు.

అత్తిరాలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

శివన్నామస్మరణలతో అత్తిరాల శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరుడి ఆలయం మారుమోగింది. ఆదివారం వందల సంఖ్యలో భక్తులు దర్శనానికి క్యూ కట్టారు. శివరాత్రి సందర్భంగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ఆరోరోజు కూడా భక్తుల తాకిడి కొనసాగింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయశాఖ, పోలీసు, రెవెన్యూ అధికారుల, ఆలయకమిటీ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు.ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులను కొనసాగించారు.

త్రేతేశ్వరస్వామికి ఎమ్మెల్యే మేడా పూజలు

శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామికి ఆదివారం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, సుచరుత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ జీ కొండారెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ వీ వెంకటసుబ్బారెడ్డి, ధర్మకర్తలు ఆలయ మార్యాదలతో ఎమ్మెల్యే మేడా దంపతులను సత్కరించారు.

అశ్వవాహనంపై త్రేతేశ్వరుడు...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి 9గంటలకు త్రేతేశ్వరుడు అశ్వవాహనంపై విహరించారు. రాత్రి 10 గంటల సమయంలో గజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. సోమవారం ఉదయం 10గంటలకు బ్రహ్మరథోత్సవం జరగనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు బండలాగుడు పోటీలను ఈఓ కొండారెడ్డి, దేవస్థాన కమిటి చైర్మన్ వీ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.


ముత్యాల తలంబ్రాలను తీసుకొస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


త్రేతేశ్వరస్వామి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

కాలజ్ఞానంపై విస్తృత చర్చజరగాలి


బ్రహ్మంగారి జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మఠం అధికారులు

బ్రహ్మంగారిమఠం : జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంపై విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి సంక్షిప్త జీవిత చరిత్ర, కాలజ్ఞానం , మఠాధిపతుల పరంపర, వంశవృక్షం కాల నిర్ణయ పట్టిక, వ్యక్తిగత విశిష్ట సేవలపై శనగపాటి బ్రహ్మానందం రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి చెప్పిన ఎన్నో విషయాలు జరిగాయని, జరగబోతున్నాయని, అందువల్ల వాటిపై చర్చ జరగాలని అన్నారు. వాటిని ముందే గ్రహించి నివారణోపాయాలను కనిపెట్టాలని చెప్పారు. అలాగే మానవులు సత్‌ప్రవర్తనతో మెలగాలని కోరారు. రచయిత ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి రచించడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మఠం మేనేజర్ శ్రీ ఈశ్వరాచారి, పూర్వపు మఠాధిపతుల కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, శ్రీ వీరభద్రస్వామి, వీరంభట్లయ్య స్వామి, దత్తాత్రేయస్వామి, వరదరాజస్వామి దివంగత మఠాధిపతి సోదరులు వీరభద్రస్వామి, ఆలయ ఆధ్యాత్మిక అధ్వర్యులు ఇడమకంటి జనార్థన శివాచార్య పాల్గొన్నారు.

భక్తజన 'ఝరి'



ఉరేగింపుగా తీసుకొస్తున్న వెంకటేశ్వరస్వామి మణి, మాన్యలు, ఝరిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి క్యూకట్టిన భక్తులు

కలకడ : మహాశివరాత్రి ఉత్సవాల్లో శనివారం రాత్రి జాగరణ ఆచరించిన భక్తులు ఆదివారం ఉదయం ఝరి స్నానాలు ఆచరించిశ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి మరుసటిరోజు మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఝరి వద్ద సత్యవతి, బాహుదానది సంగమ ప్రదేశంలో.. సత్యవతికి ఇచ్చిన మాట ప్రకారం స్వామివారు ఆమెకు దర్శన భాగ్యం కల్పించారు.

ఈ పవిత్ర నదీ సంగమంలో స్నానం ఆచరించడానికి రాయలసీమ నుంచే కాక కర్ణాటక, చెన్నై నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. ఆప్రాంతమంతా శివనామస్మరణతో మారుమోగింది.భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

దేవుళ్లకు సంబంధించిన మణి, మాన్యాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. మదనపల్లె, పీలేరు, రాయచోటి, కడప డిపోల నుంచి 75 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.

అఘోర లింగేశ్వరుడి సేవలో జిల్లా కలెక్టర్


అఘోర లింగేశ్వరుడి సన్నిధిలో కుటుంబసభ్యులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన శ్రీ అఘోరలింగేశ్వరుడికి శనివారం రాత్రి మహాశివరాత్రి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు శశిభూషణ సిద్ధాంతి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ కుటుంబ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, దశరథరామిరెడ్డి ఆలయ ప్రధాన అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వారిని సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

అయ్యప్పధర్మాన్ని విస్తృత ప్రచారం చేయాలి


అయ్యపస్వామి క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న బాలాంజనేయులు, సమ్మెట శివప్రసాద్

నందలూరు(రాజంపేట): దేశ వ్యాప్తంగా అయ్యప్ప స్వామి ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని అఖిలభారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ(ఏబీపీడీపీ) జాతీయ ప్రధానకార్యదర్శి ఏనుగుల బాలాంజినేయులు, జిల్లా అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచి సమ్మెట శివప్రసాద్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం నందలూరులో జిల్లా కార్యవర్గసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్పధర్మప్రచారాన్ని నలుదిశలా వ్యాప్తి చేసేందుకు మండలస్థాయి కమిటీలను వేసినట్లు చెప్పారు. అనంతరం ఏబీపీడీపీ క్యాలెండర్‌ను విడుదల చేశారు. జీవితకాల సభ్యులకు ధ్రువీకరణ పత్రాన్ని, గుర్తింపు కార్డుని అందచేశారు. సమావేశంలో జిల్లా కోశాధికారి జయచంద్ర, సంయుక్తకార్యదర్శి తోట శివశంకర్, మండల అధ్యక్షుడు ముమ్మడిశెట్టి సుధాకర్, జిల్లా కార్యవర్గసభ్యులు మోహన్, మురళీ, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలకు నిప్పు


కాలిపోయిన మిరపపంట, మంటలార్పేందుకు ప్రయత్నిస్తున్న రైతు

రాయచోటిటౌన్ : గుర్తు తెలియని ఆకతాయిల చేష్టలతో పొలాలకు నిప్పంటుకుంది. ఏపుగా పెరిగిన మామిడి, జామ, నేరుడు చెట్లు మంటల్లో కాలిపోయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతుల కథన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దిగువ అబ్బవరం గ్రామానికి చెందిన రామచంద్ర, వెంకటరమణలకు రాయచోటి రూరల్ పరిధిలోని శిబ్యాల గ్రామం మోడల్ స్కూల్ సమీపంలో పొలాలు ఉన్నాయి. ఇందులో మామిడి,మిరప, జామ, నేరేడు సాగు చేస్తున్నారు.వీరు ఆదివారం పొలానికి వెళ్లి చెట్లకు నీరు పారించి ఇంటికి వచ్చారు. మీ పొలాల్లో మంటలు వ్యాపించాయని స్థానికులు వారికి ఫోన్ ద్వారా తెలియజేశారు.హుటాహుటిన అక్కడికి వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు.సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేశారు.వారు అక్కడికి చేరుకునేలోపే కంచె, పంటపొలాలు కాలిపోయాయని బాధితులు వాపోతున్నారు.అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారని, పూర్తి స్థాయి నష్టం జరగకుండా ఆపగలిగారని రైతులు తెలిపారు.ఉన్నతాధికారులు స్పందించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబసమస్యలతో ఓ వృద్ధుడు ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన తంబళ్లపల్లె మండలం గోపిదిన్నెలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన సి.రామలింగప్ప (58) ఉదయం పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మదనపల్లె : కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని నెమలినగర్‌కు చెందిన రామన్న(64) కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఏడు ఇంట్లో విక్రయిస్తుండగా అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టెన్షన్ రేపిన గురుకుల విద్యార్థి అదృశ్యం


నవదీప్ (ఫైల్)

బి.కొత్తకోట : బి.కొత్తకోట సమీపంలోని జీఎంసీ బాలయోగి గురుకుల విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నవదీప్ అదృశ్యమైన ఘటనటెన్షన్‌కు గురిచేసింది. విద్యార్థి ఆచూకీ ఆదివారం రాత్రి లభ్యం కావడంతో ఊపిరిపీల్చుకున్నారు. ములకలచెరువు మండలం నాయనచెరువుపల్లెకు చెందిన నవదీప్ గురుకుల విద్యాలయంలో చదువుకుటున్నాడు. శనివారం సాయంత్రం అటల సమయం అయ్యాక భోజన సమయానికి కనిపించకపోవడంతో ప్రిన్సిపాల్ నాగవేలు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. శివరాత్రి పండుగకు ఇంటికి వెళ్లి ఉంటాడని భావించారు. తల్లిదండ్రులు కూడా ఇంటికి వస్తే విద్యాలయానికి తీసుకొస్తామని ప్రిన్సిపాల్‌కు చెప్పారు. అయితే ఆదివారం కూడా ఆచూకీ లభ్యంకాకపోవడం, ఇంటికి వెళ్లకపోవడంతో ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నవదీప్ బంధువుల ఇళ్లకు వెళ్లి ఉంటాడని భావించి ఆచూకీ ప్రయత్నాల్లో భాగంగా రాత్రి ములకలచెరువు రైల్వేస్టేషన్‌లో గాలిస్తుండగా కనిపించాడు. తల్లిదండ్రులు నవదీప్‌ను ఇంటికి తీసుకెళ్లి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఉత్కంఠ వీడింది. కాగా ఈనెల 2న ఇదే విద్యాలయానికి చెందిన 30 మంది విద్యార్థులు అదృశ్యమై కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

దర్శకుడు మదన్ తల్లి శకుంతలమ్మ మృతి


శకుంతలమ్మ (ఫైల్)

బి.కొత్తకోట : ప్రముఖ దర్శకుడు రామిగాని మదన్‌మోహన్‌రెడ్డి తల్లి శకుంతలమ్మ (75) ఆదివారం మృతి చెందారు. తెలుగుసినిమా పరిశ్రమలో మదన్‌గా సుపరిచుతుడైన దర్శకుడు. ఆ నలుగురు చిత్రంతో పాపులర్ అయిన మదన్ స్వగ్రామం బి.కొత్తకోట మండలం తుమ్మంగుట్ట పంచాయతీ బండమీదకొత్తపల్లె. మదన్ గత ఏడాది నవంబర్ 19న మృతి చెందారు. హైదరాబాద్‌లో మదన్ ఇంటిలో ఉంటున్న తల్లి శకుంతలమ్మ రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఇంటివద్దనే వైద్య చికిత్సలు పొందుతున్న ఆమె ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని రాత్రి బండమీదకొత్తపల్లెకు తరలించగా కుటుంబీకులు, బంధువులు, గ్రామస్తులు అంత్యక్రియలు నిర్వహించారు. కొడుకు మదన్ చనిపోయిన మూడునెలలకే తల్లి మరణించడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ

నలుగురికి గాయాలు: ఆస్పత్రిలో ఘర్షణ

మదనపల్లె : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం కురబలకోట మండలం చేనేతనగర్ వద్ద జరిగింది. తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి(53), కుమార్తె స్వాతి(29), ఆమె కుమారుడు దోసిక్ రెడ్డి(7) తంబళ్లపల్లెలోని మల్లయ్యకొండకు ద్విచక్రవాహనంలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. తర్వాత మదనపల్లెలోని బంధువుల ఇంటికి బయలుదేరారు. చేనేతనగర్ వద్ద సెల్ ఫోన్ మాట్లాడుతూ ద్విచక్రవాహనంలో అతివేగంతో ముదివేడుకు చెందిన సురేంద్ర(26) ఢీకొట్టాడు. ప్రమాదంలో రెండు వాహనాల్లోని నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని గమనించకుండా నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారకుడయ్యాడని సురేంద్రపై శంకర్‌రెడ్డి బంధువులు ప్రభుత్వ ఆస్పత్రిలో దాడిచేశారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది సురేంద్రను కాపాడేందుకు గదిలో ఉంచినప్పటికీ పోలీసులపై తిరగబడి మరీ దాడికి పాల్పడ్డారు. అవుట్‌పోస్టు సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని అందరినీ తరిమేశారు. సురేంద్రను పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లడంతో ఘర్షణ వాతావరణం చల్లబడింది. ముదివేడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్లకే నూరేళ్లు నిండాయి

- నీటి సంపుగుంతలో పడి బాలుడి మృతి
- మూడు రోజుల కిందట ఘటన
- చిన్నచౌక్‌లో అదృశ్యం కేసు నమోదు
- 19న బాలుడి మృతదేహం గుర్తింపు


రఖీముద్దీన్ (ఫైల్)


సంపులోని నీటిలో తేలియాడుతున్న రఖీముద్దీన్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ కాలనీలో నీటి సంపు గుంతలోని నీళ్లలో పడి సయ్యద్ రఖీముద్దీన్ (7) అనే బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన ఈనెల 16వ తేదీ సాయంత్రం జరిగింది.వివరాలు.. బాలుడి తండ్రి నజీరుద్దీన్ కడప నగరంలోని పెద్ద దర్గా సమీపంలో తోపుడు బండిపై పండ్లవ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. నజీరుద్దీన్‌కు, భార్య రజియా, సయ్యద్ ఫజులుద్దీన్ (11), సయ్యద్ అమీన (9), సయ్యద్ రఖీముద్దీన్ (7), సయ్యద్ అప్స(3) అనే పిల్లలు ఉన్నారు. తాము నివసిస్తున్న ప్రాంతంలో సహచర పిల్లలతో కలిసి సయ్యద్ రఖీముద్దీన్ సరదాగా ఆడుకుంటూ ఉండేవాడు. మృతుని తండ్రి నివసిస్తున్న ఇంటికి 200 మీటర్ల దూరంలోనే ఓ ఇంటి పునాది నిర్మాణంలోనే నీటిసంపు కోసం గుంత తవ్వి ఉంచారు. అందులో సగానికిపైగా నీరు నిల్వ ఉన్నాయి. ఇవేమీ తెలియని బాలుడు ఆడుకుంటూ వెళ్లి గుంతలో పడిపోయాడు.అయితే ఎవరూ గమనించలేదు. ఆ రోజు రాత్రి 7:30 గంటలైనా తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో నజీరుద్దీన్ భార్య రజియా భర్తకు సమాచారం తెలియజేసింది. నజీరుద్దీన్, తన స్నేహితులు, బంధువులతో కలిసి అన్ని చోట్లా వెతికారు. అంతకుముందు సాయంత్రం 6 గంటల సమయంలో తన కుమారుడు రఖీముద్దీన్, సహచర పిల్లలతో ఆడుకుంటూ ఉండటం చూసి పనిమీద కడప నగరంలోకి వెళ్లాడు.భార్య సమాచారంతో తిరిగి వచ్చి కుమారుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే రోజు రాత్రి చిన్నచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు, మరుసటి రోజున ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో చుట్టుపక్కల వారు సంఘటన స్థలంలో దుర్వాసన రావడంతో గుంతలో చూశారు.

రఖీముద్దీన్ మృతదేహం తేలియాడుతూ కనిపించింది. తల్లిదండ్రులు, బంధువులు, కన్నీరు, మున్నీరుగా విలపించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈనెల 16న ఆడుకుంటున్న సమయంలోనే గుంతలో పడి ఊపిరాడక చనిపోయి ఉంటాడని భావిస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.